సాక్షి
తూర్పుగోదావరి

శుక్రవారం । 23 । ఫిబ్రవరి । 2024



లాభాల పందిరి.. నాణ్యతకు ఊపిరి

పిఠాపురం నియోజకవర్గంలోని కూరగాయల రైతులు వినూత్న పద్ధతుల్లో టమాటా సాగు చేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు.


II లో



ఆదిదేవునికి వేదాశీర్వచనం

లోక సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ.. కల్యాణ శోభతో మెరిసిపోతున్న అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామికి అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు పలికారు.

డెల్టా కాలువలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.95 అడుగులు ఉంది.

న్యూస్‌రీల్

మలకలపల్లి వద్ద పులి సంచారం



మలకపల్లి వద్ద పులి పాదముద్రలను పరిశీలిస్తున్న అధికారులు

తాళ్లపూడి: పాపికొండలు నేషనల్ పార్క్ నుంచి తప్పించుకుని వచ్చిన పెద్దపులి.. గోపాలపురం, దేవరపల్లి మండలాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా దీని అడుగు జాడలు తాళ్లపూడి మండలంలో కూడా కనిపించడంతో మండల వాసులు ఆందోళన చెందుతున్నారు. మలకపల్లి – తిరుగుడుమెట్ట గ్రామాల మధ్య ఆయిల్ పామ్ తోటల సమీపాన పులి సంచరించిన ఆనవాళ్లను ఇక్కడి రైతులు గురువారం గుర్తించారు. దీనిపై తాళ్లపూడి తహసీల్దార్ శ్రీనివాస్ అందించిన సమాచారం మేరకు అటవీ అధికారులు, పోలీసు సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకున్నారు. రాజమహేంద్రవరం నుంచి జిల్లా అటవీ అధికారి (డీఎఫ్‌ఓ) నాగరాజు, ఫారెస్ట్ రేంజ్ అధికారి ధనరాజు, మరో ఐదుగురు సిబ్బంది ఆయా ప్రాంతాల్లో పర్యటించి, పులి పాదముద్రలను గుర్తించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, జిల్లాలోని పలు ప్రాంతాల్లో పులి జాడలు కనిపిస్తుండటంతో వెళ్లిపోయిందనుకున్న ఆ మృగం.. మళ్లీ వెనుకకు వచ్చి ఉండవచ్చని అన్నారు. స్థానిక రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మలకపల్లిలో పంట పొలాల వద్ద పులి అడుగుజాడలు కనబడటంతో మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. టాంటాం ద్వారా గ్రామ ప్రజలను హెచ్చరిస్తున్నారు.

29లోపు రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేసుకోవాలి

వ్యాపారులకు ఏసీఎల్ ఆదేశం

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): జిల్లాలోని వర్తక, వ్యాపార సంస్థలు, మోటార్ రవాణా వాహన యాజమానులు, భవన, ఇతర నిర్మాణ సంస్థలు, కాంట్రాక్టు కార్మికులను వినియోగించే కాంట్రాక్టర్లు, ప్రిన్సిపాల్ ఎంప్లాయర్లు, అంతర్రాష్ట్ర కార్మికులను వినియోగించే సంస్థలు ఈ నెల 29లోగా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్ చేసుకోవాల్సి ఉంది. కార్మిక శాఖ సహాయ కమిషనర్ (ఏసీఎల్) బీఎస్ఎం వలీ గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఆయా సంస్థలు/యజమానులు 2015 రిజిస్ట్రేషన్ చట్టం కింద రిజిస్ట్రేషన్ చేసుకుని, సర్టిఫికెట్ పొందాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్, రెన్యువల్స్‌ను సింగిల్ విండో విధానంలో గ్రామ/వార్డు సచివాలయాలు, మీసేవ సెంటర్లు లేదా ఆన్‌లైన్‌లో మీసేవ.ఏపీ.జీఓవీ.ఇన్ ద్వారా నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని వివరించారు. దీనిపై చాంబర్ ఆఫ్ కామర్స్, ఇతర వాణిజ్య సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, అవగాహన కూడా కల్పించామని తెలిపారు. ఈ నెల 29 లోగా రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేసుకోని వ్యాపారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వలీ హెచ్చరించారు.

రేపు జాబ్‌మేళా

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): వికాస ఆధ్వర్యాన కలెక్టరేట్‌లో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీలో మేనేజర్లు, ఆఫీసర్లు, ఎగ్జిక్యూటివ్ పోస్టులకు, డెక్కన్ కెమికల్స్‌లో ట్రైనీ (ప్రొడక్షన్), సీఐతు, డిక్సన్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఉద్యోగాలకు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 30 సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆయా ఉద్యోగాలను బట్టి రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకూ జీతం, ఇన్సెంటివ్‌లు, భోజన, వసతి, రవాణా సౌకర్యాలు ఉంటాయని వివరించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆ రోజు ఉదయం 9.30 గంటలకు బొమ్మూరు హార్లిక్స్ ఫ్యాక్టరీ ఎదుట ఉన్న కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో విద్యార్హతల సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో నేరుగా హాజరు కావాలని సూచించారు. వివరాలకు 7660 823 903 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

వికాసలో నేడు ఇంటర్వ్యూలు

కాకినాడ సిటీ: హెచ్‌డీఎఫ్‌సీలో బిజినెస్ ఎగ్జిక్యూటివ్, రిలేషన్‌షిప్ మేనేజర్ ఉద్యోగాలకు వికాస కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.13 వేల జీతం, ఇన్సెంటివ్‌లు, ఇన్సూరెన్స్, మెడికల్ బోనస్ ఇస్తారు. ఆసక్తి ఉన్న వారు కాకినాడ కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయంలో ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జిరాక్సులతో హాజరు కావాలని లచ్చారావు సూచించారు.



కాపవరం వెదుళ్ల చెరువు కట్ట మరమ్మతులు



చాగల్లు మండలం ఊనగట్లలో చెరువు సుందరీకరణ పనులు

అమృత సరోవరాలు



కాపవరంలో సుందరంగా తీర్చిదిద్దిన చెరువు

- రూ.4.67 కోట్లతో 75 చెరువులకు కొత్త రూపు
- గట్ల పటిష్టత, పూడికతీత పనులు సంపూర్ణం
- ప్రతిచోటా 10 వేల క్యూబిక్ మీటర్ల నీరు నిల్వ ఉండేలా చర్యలు
- వినియోగంలోకి అదనంగా 306.43 ఎకరాలు

జిల్లాలో చెరువుల అభివృద్ధి ఇలా..

నియోజకవర్గం	సుందరీకరణ చేపట్టిన విస్తీర్ణం (ఎకరాల్లో)	వెచ్చించిన మొత్తం (రూ.లక్షల్లో)
అనపర్తి	66.99	114.07
జగ్గంపేట (గోకవరం)	36.12	77.03
రాజమహేంద్రవరం రూరల్	12.07	22.65
రాజానగరం	116.95	70.42
గోపాలపురం	44.96	98.8
కొవ్వూరు	16.2	33.97
నిడదవోలు	13.14	50.39

సాక్షి, రాజమహేంద్రవరం: చెరువుల సుందరీకరణ, అభివృద్ధికి ప్రభుత్వం చేసిన కృషి సత్ఫలితాలనిచ్చింది. నాడు అస్తవ్యస్తంగా, పిచ్చిమొక్కలతో రూపు కోల్పోయిన చెరువులు నేడు కొత్త రూపును సంతరించుకున్నాయి. కొన్నేళ్లుగా నిరాదరణకు గురై, అధ్వానంగా తయారైన చెరువులు సైతం బాగుపడ్డాయి. స్వాతంత్య్ర అమృతోత్సవాల్లో భాగంగా ×అమృత్ సరోవర్ యోజన€ పేరిట కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ప్రత్యేక కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా అందిపుచ్చుకోవడం ఇందుకు ఉపయుక్తంగా నిలిచింది. జిల్లా వ్యాప్తంగా 67 గ్రామ పంచాయతీల్లోని 75 చెరువులను అమృత్ సరోవర్ పథకానికి ఎంపిక చేశారు. ఈ చెరువుల్లో పూడికలు తీసి, గట్లను పటిష్టపరచి, నీటిని నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలమట్టం పెంచాలనేది ప్రభుత్వ ఉద్దేశం. తద్వారా పశువులకు తాగునీటి, ప్రజలకు తాగు, సాగునీటి కొరతను నివారించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని 75 చెరువులను అన్ని విధాలా అభివృద్ధి చేశారు. ఏడాది వ్యవధిలో ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది.

విస్తీర్ణం ప్రామాణికంగా..

కనీసం ఎకరా ఆపై విస్తీర్ణం ఉన్న చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. కొన్నేళ్లుగా భారీగా పూడికలు పేరుకుపోయిన చెరువులను గుర్తించారు. విస్తీర్ణాన్ని బట్టి ప్రతి చెరువుకూ రూ.4 లక్షల నుంచి రూ.17.50 లక్షల వరకూ ఉపాధి హామీ పథకం నిధులు కేటాయించారు. ఒక్కో చెరువులో కనీసం 10,000 క్యూబిక్ మీటర్ల మేర నీటిని నిల్వ ఉంచేలా ప్రణాళికలు రూపొందించారు. ఆ మేరకు ఉపాధి కూలీలతో యుద్ధప్రాతిపదికన చెరువు పునరుద్ధరణ, పూడికతీత పనులు పూర్తి చేశారు. చెరువుల వద్ద ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి, వాటి స్థానంలో పూల మొక్కలు, అరటి, కొబ్బరి మొక్కలు పెంచడం ద్వారా ఆహ్లాదకర వాతావరణం తీసుకువచ్చారు. మొత్తం 75 చెరువుల అభివృద్ధితో 306.43 ఎకరాల భూములు అదనంగా వినియోగంలోకి వచ్చాయి. ఈ పనుల కోసం మొత్తం రూ.4,67,33,000 ఖర్చు చేశారు. అభివృద్ధి పనులు చేపట్టిన చెరువుల వద్ద స్వాతంత్య్ర దినోత్సవం నాడు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు జాతీయ పతాకం ఆవిష్కరించారు.

భూగర్భ జలాల వృద్ధికి దోహదం



చెరువుల అభివృద్ధి, సుందరీకరణ పనులతో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి. రైతులకు, పశువులకు మేలు జరుగుతుంది. వర్షపు నీటిని నిల్వ చేసేలా పూడికలు తొలగించి, గట్లు పటిష్టపరిచాం. తద్వారా సాగు, తాగునీటి కష్టాలను పరిష్కరించాం. కొన్నేళ్లుగా నిరాదరణకు గురైన చెరువులు ఈ పథకంతో వినియోగింలోకి వచ్చాయి.

– ఎ.ముఖలింగం, డ్వామా పీడీ

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు



రాజమహేంద్రవరం సిటీ: వివిధ పుణ్యక్షేత్రాలకు బస్సులు నడపనున్నామని ఏపీఎస్ ఆర్టీసీ రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్బం గురువారం తెలిపారు. ఈ యాత్రా స్పెషల్స్‌గా 36 పుష్ బ్యాక్ సీట్లు, ఆడియో, వీడియో సదుపాయంతో సూపర్ లగ్జరీ నాన్ ఏసీ బస్సులు నడుపుతున్నామని వివరించారు.

ప్రతి నెలా పౌర్ణమి నాడు అరుణాచలేశ్వరుడిని దర్శించుకునే విధంగా నాలుగు రోజుల పాటు జరిగే యాత్రలో కాణిపాకం, కాంచీపురం, అరుణాచలం, శ్రీపురం, శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాలు దర్శించుకునే అవకాశం ఉంటుందన్నారు.

అయోధ్య బాలరాముని దర్శన యాత్ర 11 రోజుల పాటు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా భువనేశ్వర్, పూరీ, కోణార్క్, జాజిపూర్, అలహాబాద్, కాశీ, అయోధ్య, సీతామడి, నైమిశారణ్యం, గయ, బుద్ధగయ, అరసవిల్లి, అన్నవరం ఆలయాలను దర్శించవచ్చని పేర్కొన్నారు.

అలాగే, 4 రోజుల పాటు జరిగే పరిశుద్ధ పంచక్షేత్ర దర్శిని యాత్రలో భాగంగా సుప్రసిద్ధ క్రైస్తవ పుణ్యక్షేత్రాలైన నిర్మలగిరి మాత (గౌరీపట్నం), గుణదల మేరీ మాత (విజయవాడ), దినకరన్ ప్రార్థనా గోపురం (చెన్నై), దినకరన్ బెతెస్థ ప్రార్థనా మందిరం (కోయంబత్తూరు), వేళాంకిణీ మాత ఆలయం (నాగపట్నం) దర్శించవచ్చని వివరించారు.

వివరాలకు 950 2300 189, 99 66666 544, 73829 12141 నంబర్లలో సంప్రదించాలని షబ్బం తెలిపారు.

జిల్లాలో 109 టీబీ ముక్త్ పంచాయతీలు

సీతానగరం: జిల్లావ్యాప్తంగా 300 పంచాయతీలకు ప్రధాన మంత్రి టీబీ ముక్త్ పంచాయతీ అభియాన్ పంచాయతీలు 109 గుర్తించామని జిల్లా క్షయ నియంత్రణాధికారి (డీటీసీఓ) డాక్టర్ వసుంధర తెలిపారు. మిర్తిపాడు పంచాయతీని ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో అత్యధికంగా సీతానగరం మండలంలోని సీతానగరం, మిర్తిపాడు, ములకల్లంక, కాటవరం, జాలిమూడి, వెదుళ్లపల్లి, మునికూడలి, ముగ్గళ్ళ, కూనవరం, సింగవరం, పురుషోత్తపట్నం, చీపురుపల్లిలను టీబీ ముక్త్ పంచాయతీలుగా గుర్తించామని వివరించారు. గ్రామంలో ఏడాదికి ప్రతి వెయ్యి జనాభాకు గుర్తించిన 30 మంది క్షయ అనుమానితుల్లో ఒకటికి మించకుండా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యి, వారు పూర్తిగా మందులు వాడితే దానిని టీబీ ముక్త్ పంచాయతీగా గుర్తిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం కింద జిల్లాలో గుర్తించిన 109 పంచాయతీలను జిల్లా వైద్యుల బృందం పరిశీలించి, రాష్ట్ర స్థాయికి నివేదికను పంపిస్తుందని చెప్పారు. ఇందులో భాగంగా మిర్తిపాడు గ్రామాన్ని పరిశీలించామని డీటీసీఓ డాక్టర్ వసుంధర తెలిపారు. అనంతరం ఆమె ఆధ్వర్యాన వైద్య బృందం మిర్తిపాడు పంచాయతీ ప్రజలకు అందిస్తున్న టీబీ నిర్మూలన సేవలను, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ వైద్యులను, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు ఏవీకే చైతన్య, దివ్య, మేఘన తదితరులు పాల్గొన్నారు.



మిర్తిపాడులో టీబీ నియంత్రణపై సమీక్షిస్తున్న డీటీసీఓ డాక్టర్ వసుంధర

ఇంటర్ పరీక్షలకు చకచకా ఏర్పాట్లు

- నేటి నుంచి హాల్ టికెట్ల జారీ
- కాలేజీల ద్వారా పొందవచ్చు కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): వచ్చే నెల ఒకటో తేదీ నుంచి జరిగే ఇంటర్మీడియెట్ పరీక్షలకు చకచకా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. రాష్ట్ర విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ వెలగపూడి నుంచి గురువారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ మాధవీలత, ఇంటర్మీడియెట్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు సంబంధించిన హాల్ టికెట్లను ఆయా కళాశాలల యాజమాన్యాల లాగిన్‌కు పంపించామని తెలిపారు. వీటిని ఆయా కళాశాలల్లో శుక్రవారం నుంచి తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. రానున్న రెండు రోజుల్లో పబ్లిక్ డొమైన్‌లో కూడా హాల్ టికెట్లు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 52 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మొత్తం 41,304 మంది హాజరు కావాల్సి ఉందన్నారు. వీరిలో ఫస్టియర్ విద్యార్థులు 21,288 మంది, సెకండియర్ 20,016 మంది ఉన్నారని తెలిపారు. వీరిలో రెగ్యులర్ ఇంటర్‌కు 37,502 మంది, ఒకేషనల్ కోర్సుకు 3,802 మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. అభ్యర్థులకు హాల్ టికెట్ల జారీ విషయంలో ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మార్చి 1న ఫస్టియర్, 2న సెకండియర్ ఇంటర్ పరీక్షలు ప్రారంభమై, 20వ తేదీతో పూర్తవుతాయని చెప్పారు. పరీక్ష కేంద్రాల కేటాయింపు ర్యాండమ్ విధానంలో జరుగుతోందన్నారు. హాల్ టికెట్లు, ఇతర అంశాలపై సందేహాలు, ఇబ్బందుల నివృత్తికి రాజమహేంద్రవరంలోని తమ కార్యాలయంలో కంట్రోల్ రూమును 94922 26232, 0883 – 2473430 నంబర్లతో ఏర్పాటు చేశామని ప్రాంతీయ ఇంటర్మీడియెట్ అధికారి ఐ.శారద తెలిపారు. పరీక్షలు జరిగే రోజుల్లో ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకూ దీనిని ఆయా నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి జేవీఎల్ సుబ్రహ్మణ్యం, జిల్లా ఒకేషనల్ కోర్సు అధికారి ఎన్ఎస్‌వీఎల్ నరసింహం కూడా పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత తదితరులు

నిశ్శబ్ద మృత్యువు

- ప్రాణాలు హరించే 'సెప్సిస్'
- ఈ హిడెన్ కిల్లర్‌కు ప్రతి 100కు 32 మంది బలి
- జీజీహెచ్‌లో నెల రోజుల్లోనే 18 వేల మంది బాధితుల గుర్తింపు
- నివారణపై అవగాహన కల్పిస్తున్న నిపుణులు

కాకినాడ క్రైం: చిన్నపాటి గాయాలకు గురైతే మన పెద్దవాళ్లు 'సెప్టిక్ అవుతుంది జాగ్రత్త' అంటూ హెచ్చరించడం గుర్తుందా! టీటీ చేయించుకోమని చెప్పడం తెలుసా! నిర్లక్ష్యం చేస్తే ఆ మాత్రం స్థితికే ప్రాణం పోతుందని కలలోనైనా ఊహించగలమా! కానీ అదే నిజం. చిన్న ఇన్ఫెక్షన్ ఏర్పడి.. కేవలం నిర్లక్ష్యం కారణంగా అది శరీరం మొత్తం వ్యాప్తి చెంది.. శరీర వ్యవస్థలను విచ్ఛిన్నం చేసి.. అవయవాల పనితీరును దెబ్బ తీసి.. మరణానికి చేర్చే ఈ ప్రాణాంతక స్థితినే 'సెప్సిస్' అంటారు. ఇది వ్యాధి కాదు. అయినప్పటికీ మన శరీరంలో మనకు తెలియకుండానే జడలు విప్పుకొనే ఈ నిశ్శబ్ద మృత్యువుపై అవగాహన లేక ఏటా లక్షలాది మంది ప్రాణాలు బలవుతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆవేదన వ్యక్తం చేస్తోంది. గుండె, ఊపిరితిత్తులు, కాలేయ వ్యాధులు, మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్, ఎయిడ్స్ వంటి వ్యాధులపై ప్రజల్లో కల్పించిన అవగాహన వాటి నియంత్రణకు దోహదపడిందని, అదే రీతిలో సెప్సిస్‌పై అవగాహన కల్పించలేకపోవడం తమ, వైద్య సమాజ వైఫల్యమని చెబుతోంది.



ఎందుకు వస్తుంది!

చిన్నపాటి గాయాలు తగిలితే చాలా మంది పెద్దగా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చూపుతారు. ఆ గాయాలకు సాధారణ పౌడరో, పసుపో రాసి సరిపెడతారు. లేదంటే స్థానిక మందుల దుకాణంలో అవగాహన లేని వ్యక్తి విక్రయించే పలు రకాల మాత్రలు వాడి తగ్గిపోయిందని భావిస్తారు. నిజానికి ఇన్ఫెక్షన్ వ్యాప్తికి, ప్రాణాంతక సెప్సిస్‌కు అక్కడే బీజం పడుతుంది. మరికొంత మంది వైద్యులు సూచించిన యాంటీ బయాటిక్‌లు పూర్తిగా కాకుండా, కేవలం అనారోగ్యం లేదా గాయం తగ్గే వరకే మాత్రమే వాడతారు. దీనివలన బయటి ఇన్ఫెక్షన్ తగ్గినా శరీరం లోపల దాని ఉనికి, వ్యాప్తికి అవకాశం ఉంటుంది. ఈ కారణాలతోనే చాలా మంది సెప్సిస్ బారిన పడతారు. ఇది శరీరంలో ఏ భాగానికైనా వ్యాపించవచ్చు. సెప్సిస్ స్థితి ప్రతి 100 మందిలో 32 మంది ప్రాణాలను బలిగొంటోంది. శరీరం చిరు గాయాలకు గురైనా, ఇన్ఫెక్షన్ ఏర్పడినా సెప్సిస్‌కు అవకాశం ఉంటుంది. **గాయాలు, నోరు, నాసిక, మలమూత్ర ద్వారాలు.. ఇలా దేని ద్వారానైనా ఇది వ్యాప్తి చెందుతుంది. చీము పట్టడం శరీరంలో ఇన్ఫెక్షన్ వ్యాప్తిని నిర్ధారిస్తుంది. అది నానాటికీ శరీరం మొత్తం వ్యాప్తి చెందే** ప్రమాదం ఉంటుంది. ఈ దశలో యాంటీ బయాటిక్స్ ఎంత అవసరమో.. తక్షణమే నిపుణుల పర్యవేక్షణలో చీమును తొలగించుకోవడం కూడా అంతే ముఖ్యం.

అంచెలంచెలుగా మరణం అంచుకు..

తొలుత ఇన్ఫెక్షన్ సెప్సిస్‌గా పరిణమిస్తుంది. అక్కడి నుంచి సెప్టిక్ షాక్‌గా మారి మల్టీ ఆర్గాన్ డిస్‌ఫంక్షన్ సిండ్రోమ్ (ఎంఓడీఎస్) దశకు చేరుతుంది. ఈ దశలో మరణించడానికి 50 శాతం అవకాశాలుంటాయి. సాధారణ ఇన్ఫెక్షన్‌లో హోస్ట్ టిష్యూలు, రోగ నిరోధక వ్యవస్థ ప్రభావితమైతే, సెప్సిస్ షాక్ దశలో అవయవాల పనితీరు దాదాపు క్షీణిస్తుంది. ఎంఓడీఎస్ దశలో మరణించే ప్రమాదం ఉంటుంది.

నివారణ మార్గాలివీ...

- **వ్యక్తిగత, పరిసరాల** పరిశుభ్రతకు **ప్రాధాన్యం ఇవ్వాలి.**
- **గాయాలైనప్పుడు వైద్యు**ల పర్యవేక్షణలోనే **తప్పనిసరిగా సేవలు** పొందాలి.
- **ఆరుబయట మలమూత్ర** విసర్జన చేయరాదు. **మరుగుదొడ్ల పరిశుభ్ర**ంగా ఉంచుకోవాలి.
- **యాంటీబయాటిక్స్** వినియోగం సక్రమంగా **లేనప్పుడు సెప్సిస్**‌కు దారి తీసే అవ**కాశం ఉంటుంది.** మందుల దుకాణాల్లో **లేదా అర్హత లేని వా**రి వైద్య సలహాలు, **సూచనలు తీసుకోకూ**డదు.
- **ఆ మందులు తాత్కాలి**క ఉపశమనం ఇచ్చినా **తగిన యాంటీబయాటి**క్ నిర్దిష్ట మోతాదులో ఇవ్వకపోతే ఇన్ఫెక్షన్ శరీరంలో సజీవంగా ఉండి, వ్యాపించే ప్రమాదం ఉంటుంది.
- వయస్సు రీత్యా వేసుకోవాల్సిన వ్యాక్సిన్లు తప్పనిసరిగా తీసుకోవాలి.
- విదేశాలకు వెళ్లేవారు అక్కడి వాతావరణం, ప్రజల అనారోగ్య స్థితిగతులను ముందుగానే తెలుసుకొని తగిన వ్యాక్సిన్లు వేయించుకోవాలి.

ఇవీ లక్షణాలు

సెప్సిస్ రక్తాన్ని విషతుల్యం చేస్తుంది. ముఖ్యంగా ఊపిరితిత్తులు, మెదడు, మూత్రపిండాలకు త్వరగా ఇన్ఫెక్షన్ చేరుతుంది. ఈ స్థితిని బ్యాక్టీరీమియా లేదా సెప్సీసీమియా అంటారు. దీనికి గురైన వారిలో బీపీ తగ్గడం, మూత్రపిండాల పనితీరు, శరీర భాగాలకు రక్త ప్రవాహం మందగించడం, కాలేయ పనితీరు క్షీణించడం, రోగి గందరగోళానికి గురవడం, జ్వరం, పరాకుతనం, ఒళ్లు చల్లబడటం, ఆయాసం, గుండె వేగం పెరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయని వైద్యులు చెబుతునప్పారు. కాకినాడ జీజీహెచ్‌లో ఈ ఏడాది జనవరి నెలలోనే 18 వేల మందిలో సెప్సిస్ లక్షణాలను గుర్తించారు. రోజువారీ ఓపీలో ప్రతి వెయ్యి మందిలో 300 మంది సెప్సిస్ ఇన్ఫెక్షన్ కారణంగా అతి తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని వైద్యులు వెల్లడించారు. వారిలో పలువురు కోలుకుంటూండగా కొందరు మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తో (పలు కీలక అవయవాలు పని చేయకపోవడం) ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారని చెబుతున్నారు.

వీరు మరింత జాగ్రత్త

షుగర్, క్రానిక్ లివర్ డిసీజ్, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సీఓపీడీ), ఐఎల్‌డీ బాధితులు, క్యాన్సర్ మందులు వాడేవారు, స్టెరాయిడ్‌లు, ఇమ్యునో మాడ్యులేటరీ ఏజంట్లు అయిన మందులు వినియోగించే వారు, వృద్ధులు, చంటి పిల్లలు ఎక్కువగా సెప్సిస్ బారిన పడే ప్రమాదం ఉంటుంది. హెచ్‌ఏ1సీ స్థాయి 6.5–7 మధ్య కాకుండా 9 దాటి కొనసాగుతున్న షుగర్, అన్‌కంట్రోల్డ్ డయాబెటిస్ బాధితులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తగిన వ్యాక్సినేషన్ తీసుకోవాలి. రోజుకు కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయడంతో పాటు, పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలి.


వీటితో రక్షణ



శాస్త్రీయ విధానంలో చేతులు శుభ్రం చేసుకోవడం, నిపుణుల పర్యవేక్షణలోనే యాంటీబయాటిక్స్ వినియోగించడం, వయసుకు తగిన వ్యాక్సినేషన్ వేయించుకోవడం ద్వారా సెప్సిస్ నుంచి రక్షణ పొందవచ్చు. దీనిపై అవగాహన పెంచేందుకు ఇండియన్ సొసైటీ ఆఫ్ క్రిటికల్ కేర్ మెడిసిన్(ఐఎస్‌సీసీఎం) ప్రత్యేక చర్యలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ ఎస్‌సీహెచ్ఎస్ రామకృష్ణ, కార్యదర్శి, ఐఎస్‌సీసీఎం, కాకినాడ

ఇన్ఫెక్షన్ కంట్రోల్ కమిటీల ఏర్పాటు



టీచింగ్ హాస్పిటల్‌లో మైక్రోబయాలజీ విభాగం, పీహెచ్‌సీల స్థాయిలో ఎట, స్టాఫ్ నర్సులతో కలిపి ఇన్ఫెక్షన్ కంట్రోల్ కమిటీలు వేశాం. ఇవి జిల్లాలో క్రియాశీలకంగా సేవలందిస్తున్నాయి. ఈ కమిటీల ద్వారా ఐసీయూలతో పాటు వైద్య సేవల పరంగా సున్నిత ప్రాంతాల్లో నమూనాలు సేకరిస్తారు. వీటిని ల్యాబ్‌లకు పంపి ఇన్ఫెక్షన్ కారకాలను గుర్తిస్తారు.

– డాక్టర్ నరసింహ నాయక్, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి, కాకినాడ

క్లుప్తంగా

ఘనంగా భీమేశ్వరస్వామి సదస్యం



పండితులకు వస్త్రాలు బహూకరిస్తున్న ఈఓ తారకేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో వేంచేసియున్న శ్రీ మాణిక్యాంబా సమేత శ్రీ భీమేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడోరోజు గురువారం స్వామివారి సదస్యం నిర్వహించారు. కల్యాణ మూర్తులైన మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి, లక్ష్మీ సమేత నారాయణస్వామి, చండికా సమత సూరేశ్వరస్వామివార్లను వేదికపై అధిష్ఠింపజేసి, అర్చకులు స్వామి, అమ్మవార్లకు సుగంధ ద్రవ్యాలను పూశారు. అనంతరం గణపతి పూజ, అష్టదిక్పాలక ఆవాహన, ముక్కోటి దేవతా ఆవాహన చేశారు. వేద స్వస్తి, స్వస్తి ప్రవచనం అనంతరం వేద పండితులు, ఆగమ పండితులు, అర్చకస్వాములు, స్వస్తివాచకులు, పురోహితులను ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు నూతన వస్త్రాలు అందజేసి సత్కరించారు. అనంతరం సర్వ వాహనాలపై కల్యాణమూర్తులకు నగరోత్సవం నిర్వహించారు.

24 నుంచి రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు



విలేకరులతో మాట్లాడుతున్న పట్టాభిరామమ్

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈ నెల 24 నుంచి 26 వరకు రాష్ట్ర స్థాయి ఖోఖో టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహణ కార్యదర్శి కె.పట్టాభిరామమ్, సహాయ కార్యదర్శి ఉబా కెనడీ తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వారు విలేకరులకు టోర్నీ వివరాలను తెలియజేశారు. వైఎస్సార్ మెమోరియల్ పేరిట ఈ టోర్నీ జరుగుతుందని తెలిపారు. స్త్రీ విభాగంలో 13, పురుషుల విభాగంలో 14 టీములు ఉమ్మడి జిల్లాల నుంచి పాల్గొంటాయన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పు, పశ్చిమ, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కడప, కర్నూల్, చిత్తూరు, అనంతపురం జిల్లాల నుంచి 450 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో పోటీలు జరుగుతాయని చెప్పారు. 60 మంది న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారని తెలిపారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతో రాష్ట్ర టీములను ఎంపిక చేస్తామని చెప్పారు. ఈ టీములు మార్చి 27 నుంచి ఏప్రిల్ 2 వరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు.

లాభాల పందిరి.. నాణ్యతకు ఊపిరి

- పిఠాపురం నియోజకవర్గంలో వినూత్న రీతిలో టమాటా సాగు
- హెక్టారుకు 35 టన్నుల దిగుబడి



విరవాడలో విరగపండిన టమాటా



పందిర్లపై సాగు చేసిన టమాటా పంట

పిఠాపురం: టమాటా ఎంత సున్నితంగా ఉంటుందో పంట సాగు అంతే సున్నితంగా ఉంటుంది. దిగుబడుల మాట ఎలా ఉన్నా రేటు మాత్రం రైతును ఎప్పుడు ముంచుతుందో ఎప్పుడు పెంచుతుందో తెలియని పరిస్థితి. ఇటీవల కాలంలో టమాటా రేటు టాప్ లేచి పోగా ఇప్పుడు మళ్లీ సాధారణ ధరలకు చేరుకుంది. టమాటా పంట వేసి కోటీశ్వరుడయ్యారనే వార్తలు ఆశ్చర్యాన్ని కలిగించినా అప్పట్లో ఉన్న రేటు ఆ రైతును కోటీశ్వరుడిని చేసింది. అదే టమాటా కేజీ రూపాయికి కూడా కొనేవారు లేక రోడ్లపై పారబోసిన సందర్భాల్లో టమాటా రైతులు తీవ్ర నష్టాలను చవి చూశారు. అలాంటి టమాట సాగులో మంచి ఫలితాలు సాధించడానికి పిఠాపురం నియోజకవర్గంలో రైతులు వినూత్న పద్ధతిలో టమాటా పంటను సాగు చేసి మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

పందిర్లపై పంట

సాధారణంగా టమాటా పంట నేలపై పండుతుంది. అయితే నేలపై పంట ఉండడం వల్ల ఎక్కువ తెగుళ్లు, కాయ నాసిరకంగా తయారవ్వడం వంటి సమస్యలతో పాటు దిగుబడులు అంతంతమాత్రంగానే ఉంటాయి. దీంతో రైతులు టమాటా పంటను పందిర్లు వేసి వాటిపైకి ఎక్కించడం ద్వారా మంచి దిగుబడులు సాధిస్తున్నారు. ఎకరం పొలంలో టమాటా సాగు చేసి రోజుకు 300 కేజీల వరకు దిగుబడి సాధిస్తున్నారు. సకాలంలో నీటి సదుపాయం కల్పించడంతో పాటు వేపనూనె, కషాయాలు వంటివి ఉపయోగించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ

పాడి-పంట

లాభాలు ఆర్జించవచ్చని నిరూపిస్తున్నారు. ప్రస్తుతం టమాటా రైతు వద్ద కేజీ రూ.12 నుంచి రూ.15 ఉండగా మార్కెట్‌లో రూ.30 వరకు అమ్ముతున్నారు. ఉద్యాన శాఖ ద్వారా ప్రభుత్వం సకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు అందించడంతో పాటు ఎరువులు, పురుగు మందుల వాడకాలపై తగిన సూచనలు ఇస్తుండడంతో తెగుళ్లు లేకుండా మంచి దిగుబడులు వస్తున్నాయని రైతులు అంటున్నారు.

వివరాలు ఇలా..

రైతులు:	320 మంది
సాగు చేసిన భూమి:	100 హెక్టార్లు
దిగుబడి: సుమారు 35 టన్నులు (హెక్టారుకు)	
వ్యాపార టర్నోవర్: సుమారు రూ 4.20 కోట్లు	

వేసవిలో అందుబాటులోకి వచ్చేలా సాగు



గతంలో వేసిన పంట దెబ్బతింది. దీంతో ఈసారి తగిన జాగ్రత్తలు తీసుకుని పంట సాగు చేయడంతో బాగా దిగుబడి వస్తోంది. పంటను నేలపై ఉంచకుండా పందిర్లు వేసి పందిర్ల పైకి ఎక్కించడం ద్వారా మొక్క పెద్దదిగా పాకడంతో పాటు కాయల దిగుబడి బాగా వస్తోంది. అందుకే పందిర్లు వేసి పంట సాగు చేశాను. దీని వల్ల తెగుళ్లు సోకే అవకాశాలు తగ్గాయి. కాయలు సైజులో సైతం మార్పు వచ్చింది. ఎకరం పొలంలో సాగు చేయగా రోజుకు 300 కేజీల వరకు దిగుబడి వస్తోంది. మూడు రోజుల కొకసారి టన్ను వరకు దిగుబడి వస్తోంది. రేటు ప్రస్తుతం రూ.12 వరకు ఉండడంతో ఆదాయం బాగానే ఉంది. పంట ఏప్రిల్ మే నెలల వరకు ఉండేలా నీటి వసతి కల్పించి తగిన జాగ్రత్తలు పాటిస్తున్నాను. పిఠాపురం ఉద్యాన శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తగిన సూచనలు, సలహాలు ఇస్తుండడంతో ఎటువంటి ఇబ్బంది లేకుండా పంట దిగుబడి తగ్గకుండా ఉంటోంది.

– కొప్పిశెట్టి గోవిందరాజులు, టమాటా రైతు, విరవాడ, పిఠాపురం మండలం

ఇలా చేస్తే లాభాలు ఎక్కువ



టమాటా పంటను పందిరి పద్ధతిలో సాగు చేయడం వల్ల మంచి లాభాలు ఉంటాయి. మొక్క భూమిపై పాకితే సూర్యరశ్మి మొక్క అన్ని భాగాలకు తగలక పోవడం వల్ల తెగుళ్లు, పురుగులు ఎక్కువగా ఆశిస్తాయి. కాయకు మచ్చలు కూడా వస్తాయి. దీంతో నాణ్యత తగ్గి రేటు పడిపోతుంది. ఎక్కువ రోజులు నిల్వ కూడా ఉండవు. కాని పందిరిపై సాగు చేస్తే మొక్క అన్ని భాగాలకు సూర్యరశ్మి సక్రమంగా అంది తెగుళ్లు సోకవు. కాయకు మచ్చలు ఏర్పడవు. దీంతో మంచి నాణ్యమైన పంట వస్తుంది. దానికి రేటు సైతం బాగుంటుంది. పందిర్లు వేయడానికి కొంత వరకు పెట్టుబడి అవుతుంది. కాని రైతులు ముందుగా మిరప వంటి పంటలు సాగు చేసి అవి అయిన తరువాత తీసేయకుండా వాటిలో అంతర పంటగా టమాటా వేసి మొక్కలపైకి ఎక్కించడం ద్వారా మంచి ఫలితాలు అందుకుంటున్నారు. విరవాడలో రైతు గోవిందరాజులు తన పొలంలో పందిర్లు వేసి వరుసగా చిక్కుడు, ఆనప వంటి పంటలు వేసి వాటి అనంతరం టమాటా సాగు చేశారు. దీనివల్ల అన్ని పంటలకు పెట్టుబడి ఒక్కసారే పెట్టడంతో టమాటా పంటకు పెట్టుబడి తగ్గింది. ప్రస్తుతం పంట చాలా బాగా వచ్చింది. రేటు కూడా బాగుండడంతో మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. ఇది వచ్చే రెండు నెలల వరకు ఉండేలా చూడాలి. ఏప్రిల్, మే నెలల్లో టమాటా దిగుబడులు లేక రేటు విపరీతంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. అప్పుడు మరింత లాభాలు వచ్చే అవకాశం ఉండడంతో అప్పటి వరకు పంట కొనసాగేలా బోరు సాయంతో నీటి వసతి కల్పించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. రైతులు ఇలా విభిన్న పద్ధతులు పాటిస్తే మంచి ఫలితాలు ఉంటాయి.

– కె.శైలజ, ఉద్యాన శాఖాధికారి, పిఠాపురం

చక్ర స్నానానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

అమలాపురం రూరల్: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి చక్ర స్నానానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం అమలాపురం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. శనివారం అమలాపురం నుంచి అంతర్వేదికి ఉదయం 5 గంటల నుంచి ప్రతి అరగంటకు బస్సు నడుపుతామని ఆయన తెలియజేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



సురేష్ మృతదేహం

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో ఐదుతూముల సమీపంలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం పెదపూడి మండలం, రామేశ్వరం గ్రామానికి చెందిన కూనరెడ్డి సురేష్ (39) రోడ్డుపై పడి ఉన్నాడని తెలిపారు. దుస్తులు తడిసి ఉండటంతో గోదావరి కాలువలో స్నానం చేసి వస్తూ ఉండగా ఫిట్స్ వచ్చి పడిపోయి ఉండవచ్చునని, ఆ సమయంలో ఎవరూ గమనించక పోవడంతో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపుల భర్తపై కేసు

కొవ్వూరు: భార్యపై అనుమానంతో మానసికంగాను, శారీరకంగాను వేధిస్తున్నట్లు అందిన ఫిర్యాదుపై కొవ్వూరు పట్టణానికి చెందిన దశమంతుల నాని అనే వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై మహ్మద్ జుబేద్ తెలిపారు. అతని భార్య శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

మహిళ దారుణ హత్య

- వివాహేతర సంబంధమే కారణం
- ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేసిన నిందితుడు



మరియాకుమారి మృతదేహం

ఆలమూరు: మండలంలోని చొప్పెల్లలో వివాహిత సలాది మరియా కుమారి (30) దారుణ హత్యకు గురైంది. వివాహేతర సంబంధమే ఈ హత్యకు దారి తీసింది. ఆలమూరు పోలీసు స్టేషన్‌లో రావులపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.రామ్‌కుమార్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం స్థానిక లూథరన్ చర్చి సమీపంలో నివాసముంటున్న మరియాకుమారి తన ఇంట్లో ఉరి వేసుకుని ఉండటంతో అంతా ఆత్మహత్య చేసుకుందని భావించారు. అయితే ఆమె భర్తకు అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై ఎల్.శ్రీను నాయక్ నేతృత్వంలోని పోలీసు బృందం దర్యాప్తు నిర్వహించారు. మరియాకుమారి ఆత్మహత్య చేసుకోలేదని హత్యకు గురైందని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఉరి వేసుకుందంటూ తొలుత ప్రచారం చేసిన చల్లా వీర వెంకట ప్రసన్నకుమార్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు తమ శైలిలో విచారించారు. దీంతో ప్రసన్నకుమార్ తాను చేసిన నేరాన్ని అంగీకరించి హత్యకు దారి తీసిన విధానాన్ని వివరించాడు. బిక్కవోలు మండలంలోని మెళ్లూరుకు చెందిన ప్రసన్నకుమార్ ప్రస్తుతం తన అక్క గారి ఇంటి వద్ద ఉంటూ ఇటుక బట్టీ నిర్వహిస్తున్నాడు. ఆ సమయంలో మరియాకుమారితో వివాహేతర సంబంధం ఏర్పడింది. రెండేళ్లుగా సంబంధం కొనసాగిస్తున్న మరియా కుమారి ఇటీవల వేరొక యువకుడితో సన్నిహితంగా ఉండటాన్ని ప్రసన్నకుమార్ జీర్ణించుకోలేక పోయాడు. ఇదే విషయంపై బుధవారం సాయంకాలం మరియా కుమారిని ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. కోపోద్రిక్తుడైన ప్రసన్నకుమార్ ఆమెను చెంప మీద కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మృతిని ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు మరియా కుమారి ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేశాడు. ఈ మేరకు ప్రసన్నకుమార్ తన నేరాన్ని అంగీకరించి తహసీల్దార్ గోపాలకృష్ణ వద్ద లొంగిపోయాడు. ఎస్సై శ్రీను నాయక్ కేసును నమోదు చేయగా సీఐ రామ్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

తీవ్రంగా హింసించి కొట్టి చంపేశాడు!

మృతురాలు మరియా కుమారిని నిందితుడైన ప్రసన్నకుమార్ తీవ్రంగా హింసించి దారుణంగా కొట్టి హత్య చేశాడని తెలుస్తోంది. సంఘటనా స్థలంలో దోమల బ్యాట్ విరిగిపోయి ఉండటంతో పాటు మృతురాలు మెడకు ఇరువైపుల పదునైన ఆయుధంతో నొక్కినట్లు ఆనవాళ్లు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. బుధవారం సాయంకాలం జరిగిన ఈ హత్య గురువారం ఉదయం వరకూ వెలుగులోకి రాకపోవడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది.

సాహితీ పిపాసి.. సంస్కరణాభిలాషి

- విద్య అంటే దేవులపల్లికి ప్రాణం
- హరిజనోద్ధరణలో పాల్గొనడంతో వెలి వేసిన బంధువులు
- ఆయన ఇల్లు పాఠశాలకు దానం
- రేపు కృష్ణశాస్త్రి వర్ధంతి



చంద్రంపాలెం హైస్కూల్‌లో ఏర్పాటు చేసి కృష్ణశాస్త్రి విగ్రహం



దేవులపల్లి దానం చేసిన స్థలంలో పాఠశాల

సామర్లకోట: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం చంద్రంపాలెం గ్రామంలో జన్మించిన దేవులపల్లి కృష్ణశాస్త్రికి విద్య అంటే ప్రాణం. ప్రతీ చిన్నారి చదువు కోవాలనే అభిప్రాయంతో తన ఇంటిని పాఠశాలకు దానంగా ఇచ్చిన మహా వ్యక్తి. నవంబర్ 1, 1897లో చంద్రంపాలెంలో జన్మించిన ఆయన 1980 ఫిబ్రవరి 24న మృతి చెందారు. కృష్ణశాస్త్రి తండ్రి, పెదతండ్రి మంచి పండితులు కావడంతో వారింట్లో నిరంతరం ఏదో సాహిత్య గోష్ఠి జరుగుతూ ఉండేది. దాంతో చిన్నతనం నుంచి కృష్ణశాస్త్రి రచనలు ఆరంభించారు. పిఠాపురం హైస్కూల్‌లో విద్యాభ్యాసం సాగింది. 1918లో విజయనగరం వెళ్లి డిగ్రీ పూర్తి చేసి కాకినాడ చేరుకున్నారు. పెద్దాపురం మిషన్ హైస్కూల్‌లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. అదే సమయంలో వ్యావహారిక భాషావాదం, బ్రహ్మ సమాజం వంటి ఉద్యమాల ప్రభావం ఆయనపై పడింది. దాంతో ఉపాధ్యాయ వృత్తి వదలి బ్రహ్మ సమాజంలో చురుకుగా పాల్గొనేవారు. అదే సమయంలో సాహితీ వ్యాసంగం కూడా కొనసాగించారు.

రైలులో ప్రారంభం అయిన రచనలు

1920లో వైద్యం కోసం రైలులో బళ్లారి వెళుతుండగా ప్రకృతి నుంచి లభించిన ప్రేరణ కారణంగా 'కృష్ణ పక్షం కావ్యం' రూపు దిద్దుకొంది. 1922లో భార్య వియోగంతో కొంతకాలం రచనలకు దూరంగా ఉన్నారు. నవ్య సాహితీ సమితిలో సభ్యునిగా, భావ కవిత్వోద్యమ ప్రవర్తకునిగా దేశమంతా ప్రచారంలో పాల్గొన్నారు. దాంతో అనేక మంది కవులు, పండితులతో పరిచయాలు పెరిగాయి. పిఠాపురంలోని హరిజన వసతి గృహంతో సంబంధం ఏర్పరచుకొని హరిజనోద్ధరణ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనడంతో బంధువులు ఆయనను వెలి వేశారు. అయినా భయపడ కుండా వేశ్యా వివాహ సంస్థను ఏర్పాటు చేసి ఎందరో కళావంతులకు వివాహాలు నిర్వహించారు. సంస్కరణా కార్యక్రమాలు నిర్వహిస్తూనే 'ఊర్వశి' అనే కావ్యం రాశారు. 1942లో బీఎస్ రెడ్డి ప్రోత్సాహంతో మల్లీశ్వరీ చిత్రానికి పాటలు రాశారు. 1957లో ఆకాశవాణిలో చేరి తెలుగు సాహిత్య ప్రయోక్తగా అనేక గేయాలు, నాటికలు, ప్రసంగాలు అందించారు. మల్లీశ్వరీ చిత్రంతో సినిమా రంగంలో అడుగు పెట్టిన ఆయన అనేక పాటలు రాశారు. రాజమకుటం, సుఖదుఃఖాలు, కలిసిన మనుసులు, అమెరికా అమ్మాయి, గోరింటాకు వంటి చిత్రాల్లో 170 పాటలు మాత్రమే రాసినా కృష్ణశాస్త్రి మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. 1963లో అనారోగ్య కారణంగా శాస్త్రి గొంతు మూగబోయింది. 1980 ఫిబ్రవరి 24న మరణించారు. 1975లో ఆంధ్ర విశ్వ విద్యాలయం నుంచి కళాప్రపూర్ణ, 1978లో సాహిత్య అకాడమి అవార్డు, 1976లో పద్మ భూషణ్ పురస్కారాలను అందుకున్నారు. మహాకవి శ్రీశ్రీ, విశ్వనాథ సత్యనారాయణలు కృష్ణశాస్త్రి కవితాశైలిపై ఎంతో మక్కువ చూపే వారు. కృష్ణశాస్త్రి దానంగా ఇచ్చిన పాఠశాలలో గ్రామస్తులు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆయన అభిమానులు ప్రతీ ఏటా వర్ధంతి, జయంతి వేడుకలు నిర్వహిస్తున్నారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి ఆశయాలను ముందుకు తీసుకొని వెళ్లే విధంగా బచ్చు ఫౌండేషన్ సంస్థ పాఠశాలలో నూతన తరగతి గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

తీర ప్రాంతంలో భారీ బందోబస్తు

తొండంగి: మాఘ పౌర్ణమి సందర్భంగా శనివారం మండలంలోని సముద్రతీర ప్రాంతాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు స్థానిక ఎస్సై వినయ్ ప్రతాప్ తెలిపారు. శనివారం తెల్లవారుజాము నుంచి దానవాయిపేట, పెరుమాళ్లపురం, కొత్తచోడిపల్లిపేట, అద్దరిపేట, పంపాదిపేట, జి.ముసలయ్యపేట, కొత్తపేట, యర్రయ్యపేట, వాకదారిపేట, తాటియాకులపాలెం తదితర తీర ప్రాంతాల్లో పుణ్యస్నానాలకు భారీగా భక్తులు తరలివస్తారన్నారు. ఈ నేపథ్యంలో ఎటువంటి ప్రమాదాలు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రమాదకర ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది వచ్చినా వెంటనే 94409 04847 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

ఆదిదేవునికి వేదాశీర్వచనం

- ఏకశిల మంటపంలో పండిత సదస్యం
- హనుమద్వాహనం, సింహవాహనంపై గ్రామోత్సవాలు



సదస్యం నిర్వహిస్తున్న అర్చకులు, వేరూరు వేద పండితులు

సఖినేటిపల్లి: కల్యాణ శోభతో మెరిసిపోతున్న ఆదిదేవునికి గురువారం లోక సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ అర్చకులు వేదమంత్రోచ్చరణలతో ఆశీర్వచనాలు పలికారు. అంతర్వేది లక్ష్మీనృసింహస్వామి వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు స్వామికి వేద పండితులు, అర్చకులు ఆశీర్వచనాలు పలికే ఘట్టం సదస్యం. ఆలయంలోని ఏకశిల మంటపంలో ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు నిర్వహించిన పండిత సదస్యం ఆద్యంతం భక్తులను అలరించింది. తొలుత మంటపంలో ఏర్పాటు చేసిన పుష్పాలంకృత సింహాసనంపై నూతన దంపతులైన స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చారు. విష్వక్సేన పూజ, మంటపారాధన, సప్తరుషి పూజలను నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్ పాల్గొన్నారు.

వాహనాలపై గ్రామోత్సవాలు

గురువారం సాయంత్రం హనుమద్వాహనంపైన, రాత్రి సింహవాహనంపైన గ్రామోత్సవాలు అర్చకులు నిర్వహించారు. భక్తులు కూడా హనుమంతుని వలె స్వామిని తలుచుకుని పనులు నిర్విఘ్నంగా పూర్తిచేయవచ్చని చాటి చెప్పడమే ఈ హనుమద్వాహనం పరమార్థం. కాగా మానవుడు, మాధవుడు కలసిన స్వరూపమే లక్ష్మీనృసింహస్వామి. అట్టి మాధవ స్వరూపం, సింహం నేనేనని స్వామి ఈ సింహ వాహనం పరమార్థం. తొలుత ఆలయం నుంచి పల్లకిలో స్వామి, అమ్మవార్లను అలంకార మంటపానికి అర్చకులు తోడ్కొని వచ్చారు. అలంకార మంటపంలో పూలతో స్వామిని అలంకరించారు. వాహనాల వద్ద ప్రముఖులు, అర్చకులు కొబ్బరికాయలు కొట్టి గ్రామోత్సవాలకు శ్రీకారం చుట్టారు.

అంతర్వేదిలో నేడు

ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు శుక్రవారం వేకువ జామున 5.30 గంటల నుంచి సుప్రభాత సేవ, స్వామివారి తిరువారాధన, అలంకరణ, బాలభోగం, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు. సాయంత్రం 4 గంటలకు రాజాధిరాజ వాహనంపైన, రాత్రి 7 గంటలకు అశ్వవాహనంపైన గ్రామోత్సవాలు నిర్వహిస్తారు. రాత్రి 8 గంటలకు 16 స్తంభాల మంటపం వద్ద అర్చకులు చోర సంవాద ఘట్టం నిర్వహించనున్నారు.



హనుమద్వాహనంపై గ్రామోత్సవం

యువతి ఆత్మహత్యాయత్నం

ఏలేశ్వరం: ప్రేమించిన వ్యక్తి మోసం చేశాడనే మనస్తాపంతో పట్టణంలో గురువారం ఓ యువతి ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాల్లోకి వెళితే...పట్టణంలోని వినోద్‌మిత్రా నగర్‌కు చెందిన యువతి అదే ప్రాంతానికి చెందిన కె.రవికుమార్ అనే యువకుడిని ప్రేమించింది. పెళ్లి చేసుకుంటానని యువకుడు నమ్మించడంతో వారిద్దరూ ఒక్కటయ్యారు. విషయం తెలుసుకున్న రవికుమార్ బంధువులు ఆమెను వేధింపులకు గురి చేశారు. ఇటీవల వివాహ వేడుకకు వెళ్లిన యువతిని రవికుమార్ బంధువులు వేధించడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న అద్దాలు శుభ్రం చేసుకొనే కోలిన్ అనే ద్రావణాన్ని తాగింది. ఆమె అపస్మారక స్థితికి చేరుకోగా బంధువులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ తరలించారు. దీనిపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.



ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న యువతి

సాక్షి బిజినెస్
శుక్రవారం
23-2-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
535	162
73,158	22,217

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	15,960	▲ 379
డోజోన్స్	38,878	▲ 265
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,684	▲ 22
డాక్స్	17,370	▲ 252
షాంఘై	2,988	▲ 37
నికాయ్	39,099	▲ 836

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,155	▼ 103
బంగారం (99.5 స్వచ్ఛత)	61,906	▼ 103
వెండి (కేజీ)	70,396	▼ 312

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.51	83.53
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.62	106.16
€	యూరో	ఎస్‌బీఐ	88.61	90.97
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.76	56.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.58	55.50
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.41	64.01
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.22	22.79
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.96	23.49
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.42	12.49

మారుత్ డ్రోన్స్‌కు తొలి యుటిలిటీ పేటెంట్

డ్రోన్ల సాయంతో వరిసాగు



హైదరాబాద్: మారుత్ డ్రోన్స్ ప్రపంచంలోనే తొలి యుటిలిటీ పేటెంట్‌ను (మేథో సంపత్తి హక్కు) 20 ఏళ్ల కాలానికి సొంతం చేసుకుంది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ వర్సిటీ (పీజేటీఎస్‌ఏయూ) సహకారంతో మారుత్ డ్రోన్స్ అభివృద్ధి చేసిన డైరెక్ట్ సీడింగ్ డ్రోన్‌కు ఈ పేటెంట్ దక్కింది. క్షేత్రస్థాయిలో వరిసాగు కోసం డైరెక్ట్ సీడింగ్ డ్రోన్లను విస్తృతంగా వినియోగించే దిశగా పనిచేయనున్నట్టు సంస్థ ప్రకటించింది. 2030 నాటికి మిలియన్ హెక్టార్లలో విత్తు నాటాలన్న లక్ష్యాన్ని సంస్థ నిర్దేశించుకున్నట్లు మారుత్ డ్రోన్స్ వ్యవస్థాపకుడు, సీఈవో ప్రేమ్ కుమార్ విస్లావత్ తెలిపారు.

మూడేళ్లలో రూ. 10 వేల కోట్ల ఆదాయం

డెకరేటివ్ పెయింట్స్ వ్యాపారంలోకి ఆదిత్య బిర్లా గ్రూప్



న్యూఢిల్లీ: కొత్త వెంచర్ అయిన డెకరేటివ్ పెయింట్స్ వ్యాపార విభాగం నుంచి వచ్చే మూడేళ్లలో రూ. 10,000 కోట్ల ఆదాయాన్ని అంచనా వేస్తున్నట్లు ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా తెలిపారు. అప్పటికల్లా లాభాల్లోకి మళ్లగలమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బిర్లా ఓపస్ బ్రాండ్ కింద డెకరేటివ్ పెయింట్ల వ్యాపారంతో పాటు మూడు పెయింట్ ప్లాంట్లను గురువారం ఆయన ప్రారంభించారు. పానిపట్ (హరియాణ), లూధియానా (పంజాబ్), చెయ్యార్ (తమిళనాడు)లో ఈ ప్లాంట్లు ఉన్నాయి. బిర్లా ఓపస్ పెయింట్లు మార్చి నుంచి పంజాబ్, హరియాణ, తమిళనాడులో లభ్యమవుతాయి. జూలై నుంచి 1 లక్షకు పైగా జనాభా ఉన్న పట్టణాల్లో ఇవి లభిస్తాయని బిర్లా చెప్పారు. ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి 6,000 పట్టణాలకు కార్యకలాపాలు విస్తరించాలని నిర్దేశించుకున్నట్లు వివరించారు. గ్రూప్‌లో కీలకమైన గ్రాసిమ్ ఇండస్ట్రీస్ గతేడాది డెకరేటివ్ పెయింట్ల వ్యాపారంలోకి అడుగు పెడుతున్నట్లు ప్రకటించింది. 2025 నాటికి రూ. 10,000 కోట్లతో దేశీయంగా ఆరు తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే రూ. 5,000 కోట్లు వెచ్చించినట్లు బిర్లా ఓపస్ బిజినెస్ హెడ్ హిమాంశు కపానియా తాజాగా చెప్పారు. దేశీయంగా డెకరేటివ్ పెయింట్స్ మార్కెట్ దాదాపు రూ. 80,000 కోట్ల స్థాయిలో ఉంది. ఏషియన్ పెయింట్స్, బర్జర్ పెయింట్స్, నెరోలాక్, అక్జో నోవెల్ (డ్యూలక్స్) ఈ విభాగంలో దిగ్గజాలుగా ఉన్నాయి.

వొడాఫోన్ ఐడియా నిధుల బాట

- ఈ నెల 27న బోర్డు సమావేశం
- కంపెనీ బలిమికి కట్టుబాటు
- కుమార మంగళం బిర్లా వెల్లడి

న్యూఢిల్లీ: మొబైల్ టెలికం దిగ్గజం వొడాఫోన్ ఐడియా నిధుల సమీకరణకు ప్రతిపాదించింది. ఈ అంశంపై చర్చించేందుకు కంపెనీ బోర్డు ఈ నెల 27న సమావేశం కానున్నట్లు కంపెనీ పేర్కొంది. నిధుల సమీకరణకున్న అన్ని అవకాశాలను బోర్డు పరిశీలించనున్నట్లు తెలియజేసింది. రైట్స్, పబ్లిక్ ఆఫర్, ప్రిఫరెన్షియల్ కేటాయింపులు, క్విప్ తదితర మార్గాలతోపాటు.. ఒకేసారి లేదా దశలవారీగా నిధుల సమీకరణకు తెరతీసే అంశంపై నిర్ణయించనున్నట్లు వివరించింది. వెరసి ఈక్విటీ లేదా రుణ మార్గాలలో నిధుల సమీకరణ చేపట్టనున్నట్లు బీఎస్‌ఈకి వొడాఫోన్ ఐడియా తాజాగా వెల్లడించింది.



విదేశీ ఇన్వెస్టర్లకు చోటు

నగదు సవాళ్లను ఎదుర్కొంటున్న వొడాఫోన్ ఐడియా కంపెనీ బలిమికి కట్టుబడి ఉన్నట్లు ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమారమంగళం బిర్లా తాజాగా స్పష్టం చేశారు. బిర్లా గ్రూప్ డెకరేటివ్ పెయింట్ల బిజినెస్‌లోకి ప్రవేశిస్తున్న సందర్భంగా వొడాఫోన్‌లో విదేశీ ఇన్వెస్టర్లకు చోటు కల్పించేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తెలియజేశారు. అయితే బోర్డులో విదేశీ ఇన్వెస్టర్లు ఎప్పుడు ప్రవేశిస్తారన్న అంశంపై ఇప్పుడే చెప్పలేమన్నారు. ఇందుకు వ్యూహాత్మకంగా తగిన ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడించారు. వొడాఫోన్ ఐడియాలో ఆదిత్య బిర్లా గ్రూప్ సహప్రమోటర్‌గా ఉన్న సంగతి తెలిసిందే. కాగా.. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం(అక్టోబర్–డిసెంబర్)లో కంపెనీ రూ. 6,986 కోట్లకు నికర నష్టాన్ని తగ్గించుకుంది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 7,990 కోట్ల నష్టం ప్రకటించింది. దాదాపు రూ. 756 కోట్ల అనూహ్య లాభాలు నష్టాలు తగ్గేందుకు సహకరించాయి. భారీ రుణ భారాన్ని మోస్తున్న వొడాఫోన్ ఐడియా మొబైల్ టెలికం రంగంలోని ప్రత్యర్థి సంస్థలు రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌నుంచి తీవ్ర పోటీని ఎదుర్కొంటోంది.

నిధుల సమీకరణ వార్తలతో వొడాఫోన్ ఐడియా షేరు బీఎస్‌ఈలో 6.3 శాతం జంప్‌చేసి రూ. 16.30 వద్ద ముగిసింది.

-542 నుంచి +535

కనిష్టాల నుంచి మార్కెట్ ర్యాలీ



- నాలుగో రోజు నిఫ్టీ సరికొత్త రికార్డు
- ట్రేడింగ్‌లో భారీ ఒడిదుడుకులు

ముంబై: మిడ్‌సెషన్ నుంచి ఆటో, ఐటీ, టెక్నాలజీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు గురువారం కనిష్ట స్థాయిల నుంచి బౌన్స్ బ్యాక్ అయ్యాయి. యూరో జోన్ తయారీ, సేవా రంగ పీఎంఐ డేటా అంచనాలకు మించి నమోదవడంతో పాటు అమెరికా టెక్ కంపెనీల క్యూ3 ఆర్థిక ఫలితాలు మెప్పించడం దేశీయ ఈక్విటీ మార్కెట్ల రికవరీ ర్యాలీకి తోడ్పాటు అందించాయి. ఉదయం స్తబ్దుగా ట్రేడింగ్ ప్రారంభించిన సూచీలు రోజంతా తీవ్ర ఊగిసలాటకు లోనయ్యాయి. ఇంట్రాడేలో 542 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్ చివరికి 535 పాయింట్ల లాభంతో 73,158 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 1176 పాయింట్ల రేంజ్‌లో 72,081 వద్ద కనిష్టాన్ని, 73,256 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 180 పాయింట్ల నష్టం తేరుకొని 162 పాయింట్లు బలపడి 22,217 వద్ద స్థిరపడింది. ఒక దశలో 197 పాయింట్లు పెరిగి వరుసగా నాలుగోరోజూ 22,252 వద్ద జీవితకాల గరిష్టాన్ని లిఖించింది. ఈ సూచీకి ముగింపు(22,217)కూడా కొత్త రికార్డు కావడం విశేషం. ఆటో, ఐటీతో పాటు క్యాపిటల్ గూడ్స్, పారిశ్రామిక, విద్యుత్ రంగాల షేర్లూ రాణించాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈలో మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.92%, 0.54% చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,410 కోట్ల షేర్లను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,824 కోట్ల షేర్లు కొన్నారు. ఆసియాలో ఇండోనేసియా మినహా అన్ని దేశాల స్టాక్ సూచీలు 2% వరకు ర్యాలీ చేశాయి. యూరప్‌లో ఫ్రాన్స్, జర్మనీ ఎక్స్ఛేంజీలు 1.50% లాభపడ్డాయి. అమెరికా మార్కెట్లు 2% లాభాల్లో ట్రేడవుతున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం(2024–25) సీజన్‌లో చెరకు కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.25 మేర పెంచుతున్నట్లు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ నిర్ణయం తీసుకోవడంతో చక్కెర ధరలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈలో రానా షుగర్స్, మవాన షుగర్స్, శ్రీ రేణుక షుగర్స్, దాల్మియా షుగర్స్, భరత్ షుగర్ అండ్ ఇండస్ట్రీస్, ఈఐడీ ప్యారీ షుగర్స్ షేర్లు 3% - 1% చొప్పున నష్టపోయాయి.

డాలర్ మారకంలో రూపాయి విలువ 11 పైసలు బలపడి 82.85 వద్ద స్థిరపడింది.

కొత్త చందాదారుల ఆకర్షణలో జియో టాప్

డిసెంబర్‌లో 40 లక్షల కస్టమర్లు • ఎయిర్‌టెల్‌లోకి 18.5 లక్షలు • 119 కోట్లకు టెలికం చందాదారులు



న్యూఢిల్లీ: కొత్త కస్టమర్లను ఆకర్షించడంలో మరోసారి రిలయన్స్ జియో ముందుంది. 2023 డిసెంబర్ నెలకు గాను 39.94 లక్షల మొబైల్ చందాదారులను జియో సొంతం చేసుకుంది. భారతీ ఎయిర్‌టెల్ కిందకు కొత్తగా 18.5 లక్షల మంది కస్టమర్లు వచ్చి చేరారు. అదే సమయంలో ఎప్పటి మాదిరే వొడాఫోన్ ఐడియా మరో 13.68 లక్షల కస్టమర్లను డిసెంబర్‌లో కోల్పోయింది. ప్రభుత్వరంగ బీఎస్ఎన్ఎల్ 1.5 లక్షల కస్టమర్లు, ఎంటీఎన్ఎల్ 4,420 మంది కస్టమర్ల చొప్పున నష్టపోయాయి. మొత్తం టెలికం చందాదారులు 2023 నవంబర్ నాటికి 1,185.73 మిలియన్లుగా ఉంటే, డిసెంబర్ చివరికి 1,190.33 మిలియన్లకు (119 కోట్లకు) చేరారు. నెలవారీగా ఇది 0.39 శాతం వృద్ధికి సమానం. బ్రాడ్‌బ్యాండ్ చందాదారులు సైతం 90.4 కోట్లకు పెరిగారు. వైర్‌లైన్ టెలిఫోన్ చందాదారుల సంఖ్య నవంబర్ చివరికి 3.15 కోట్లుగా ఉంటే, డిసెంబర్ చివరికి 3.18 కోట్లకు పెరిగింది. వైర్‌లైన్ విభాగంలో జియో 2.46 లక్షల కొత్త కస్టమర్లను సాధించింది. ఎయిర్‌టెల్ 82,317 మంది, వొడాఫోన్ ఐడియా 9,656, క్వాంటమ్ 6,926 కస్టమర్ల చొప్పున సొంతం చేసుకున్నాయి. బీఎస్ఎన్ఎల్ 34,250 మంది, టాటా టెలిసర్వీసెస్ 22,628 మంది చొప్పున కస్టమర్లను కోల్పోయాయి.

సి.ఎం.ఆర్. ప్రచారకర్తగా మృణాల్ ఠాకూర్



హైదరాబాద్: ప్రముఖ వస్త్ర స్వర్ణాభరణాల సంస్థ సి.ఎం.ఆర్.షాపింగ్ మాల్ నూతన బ్రాండ్ అంబాసిడర్‌గా సినీ నటి మృణాల్ ఠాకూర్ నియమితులయ్యారు. తెలుగువారి ప్రతి వేడుకలో భాగమైన సి.ఎం.ఆర్.కు ప్రచారకర్తగా ఎంపిక కావడం సంతోషంగా ఉందని మృణాల్ ఠాకూర్ ఈ సందర్భంగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. శుభ కార్యాలకు ప్రత్యేక పట్టువస్త్రాలు, యువత మెచ్చే సరికొత్త ఫ్యాషన్స్, అద్భుతమైన డిజైన్లతో కిడ్స్ వేర్ కలెక్షన్స్ ఇక్కడ లభిస్తాయన్నారు. ''మృణాల్ ఠాకూర్ మా సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండటం సంతోషంగా ఉంది. ప్రపంచ స్థాయి ఫ్యాషన్ ట్రెండ్‌కు అనుగుణంగా ఎప్పటికప్పుడు సరికొత్త కలెక్షన్స్ మా వద్ద లభిస్తాయి'' అని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీ తెలిపారు

అశోక్ లేలాండ్ @ 30 లక్షలు



చెన్నై: హిందూజా గ్రూప్ కంపెనీ, వాణిజ్య వాహనాల తయారీలో ఉన్న అశోక్ లేలాండ్ సరికొత్త మైలురాయిని చేరుకుంది. ఉత్తరాఖండ్‌లోని పంత్‌నగర్ వద్ద ఉన్న కంపెనీ ప్లాంటు మొత్తం 30 లక్షల యూనిట్లను తయారు చేసి కొత్త రికార్డు సృష్టించింది. అత్యంత విశ్వసనీయ ఉత్పత్తులను తయారు చేయడంలో, అగ్రశ్రేణి కస్టమర్ సేవలను అందించడంలో సుస్థిర ఖ్యాతికి ఈ మైలురాయి నిదర్శనం అని అశోక్ లేలాండ్ ఎండీ, సీఈవో శేణు అగర్వాల్ గురువారం తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

23-2-2024	
విశాఖ	525–00
చిత్తూరు	603–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515–00
విజయవాడ	515–00
రిటైల్ ధర (డజను)	72.00
22-2-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	534–00
వరంగల్	536–00
రిటైల్ ధర	5.95

సాక్షి స్పోర్ట్స్



ఐపీఎల్ నుంచి షమీ అవుట్

భారత పేస్ బౌలర్ షమీ ఎడమ కాలి మడమ గాయం కారణంగా ఐపీఎల్–2024 సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. గత నెలలో లండన్‌లో ఈ గాయానికి చికిత్స తీసుకునే క్రమంలో మడమకు అతను ప్రత్యేక ఇంజక్షన్‌లు తీసుకున్నాడు. అయితే అవి ప్రభావం చూపించకపోవడంతో శస్త్ర చికిత్స చేయించుకోవడం తప్పనిసరిగా మారింది. త్వరలోనే అతను మళ్లీ లండన్‌కు వెళతాడు. వన్డే వరల్డ్ కప్‌లో 24 వికెట్లతో భారత్‌ను ఫైనల్ చేర్చడంలో కీలక పాత్ర పోషించిన షమీ ఆ తర్వాత మరే మ్యాచ్‌లోనూ బరిలోకి దిగలేదు.

నేటి నుంచి రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్స్

రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ ఎలైట్ డివిజన్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు శుక్రవారం మొదలుకానున్నాయి. ఇండోర్‌లో మధ్యప్రదేశ్‌తో ఆంధ్ర జట్టు... ముంబైలో బరోడాతో ముంబై జట్టు... నాగ్‌పూర్‌లో కర్ణాటకతో విదర్భ... కోయంబత్తూరులో తమిళనాడుతో డిఫెండింగ్ చాంపియన్ సౌరాష్ట్ర తలపడనున్నాయి.

చెన్నై X బెంగళూరు

మార్చి 22న ఐపీఎల్ మొదటి పోరు

- తొలి దశ షెడ్యూల్ విడుదల
- వైజాగ్‌లో రెండు ఢిల్లీ జట్టు మ్యాచ్‌లు



బెంగళూరు కెప్టెన్ డు ప్లెసిస్, చెన్నై కెప్టెన్ ధోని (ఫైల్)

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)–2024కు అధికారికంగా నగారా మోగింది. మార్చి 22న జరిగే టోర్నీ తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ తమ సొంతగడ్డపై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టుతో తలపడుతుంది. దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీసీసీఐ రెండు దశల్లో ఐపీఎల్‌ను నిర్వహించాలని నిర్ణయించింది. అందుకే తొలి దశలో మార్చి 22 నుంచి ఏప్రిల్ 7 మధ్య జరిగే 21 మ్యాచ్‌ల షెడ్యూల్‌ను మాత్రమే విడుదల చేసింది. లీగ్‌లో మొత్తం 74 మ్యాచ్‌లు జరుగుతాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత మిగిలిన 53 మ్యాచ్‌ల తేదీలు, వేదికలను బోర్డు ప్రకటిస్తుంది. గత రెండు సీజన్ల తరహాలోనే 10 జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. ప్రతీ టీమ్ లీగ్ దశలో 14 మ్యాచ్‌లు ఆడుతుంది. టోర్నీ ఫైనల్ మే 26న జరిగే అవకాశం ఉంది. తొలి 21 మ్యాచ్‌ల షెడ్యూల్‌లో నాలుగు తేదీల్లో ఒకేరోజు రెండు మ్యాచ్‌లు ఉన్నాయి. ఈ 17 రోజుల్లో ఢిల్లీ, గుజరాత్, బెంగళూరు గరిష్టంగా ఐదేసి మ్యాచ్‌ల చొప్పున ఆడతాయి.

అందుకే విశాఖలో...

ఆంధ్ర క్రికెట్ అభిమానులకు ఐదేళ్ల విరామం తర్వాత ఐపీఎల్ మ్యాచ్‌లు చూసే అవకాశం దక్కుతోంది. ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్ తమ రెండు 'హోమ్' మ్యాచ్‌లను వైజాగ్‌లో ఆడాలని నిర్ణయించుకుంది. క్యాపిటల్స్ సొంత వేదిక ఫిరోజ్‌షా కోట్లా మైదానం మార్చి 17న జరిగే డబ్ల్యూపీఎల్ ఫైనల్ సహా మొత్తం 11 మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తోంది. దాంతో ఐపీఎల్‌కు ముందు గ్రౌండ్ సన్నద్ధతకు తగినంత సమయం లభించడం లేదు. ఈ కారణంగా క్యాపిటల్స్ తమ వేదికను వైజాగ్‌కు మార్చింది. విశాఖలో వైఎస్ఆర్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియం ఇప్పటి వరకు 13 ఐపీఎల్ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇచ్చింది. ఆఖరి సారిగా 2019 లీగ్‌లో ఎలిమినేటర్, క్వాలిఫయింగ్–2 మ్యాచ్‌లు ఇక్కడే జరిగాయి. మరోవైపు పంజాబ్ కింగ్స్ కూడా తమ హోమ్ వేదికను మార్చింది. ఇప్పటి వరకు మొహాలి ఈ టీమ్ సొంత గ్రౌండ్‌గా ఉండగా... చండీగఢ్ శివార్లలో ముల్లన్‌పూర్‌లో కొత్తగా నిర్మించిన స్టేడియంలో ఇకపై తమ హోమ్ మ్యాచ్‌లు ఆడుతుంది.

ఐపీఎల్ తొలి దశ షెడ్యూల్

తేదీ	మ్యాచ్	వేదిక
మార్చి 22	చెన్నై X బెంగళూరు	చెన్నై
మార్చి 23	పంజాబ్ X ఢిల్లీ	చండీగఢ్
మార్చి 23	కోల్‌కతా X హైదరాబాద్	కోల్‌కతా
మార్చి 24	రాజస్తాన్ X లక్నో	జైపూర్
మార్చి 24	గుజరాత్ X ముంబై	అహ్మదాబాద్
మార్చి 25	బెంగళూరు X పంజాబ్	బెంగళూరు
మార్చి 26	చెన్నై X గుజరాత్	చెన్నై
మార్చి 27	హైదరాబాద్ X ముంబై	హైదరాబాద్
మార్చి 28	రాజస్తాన్ X ఢిల్లీ	జైపూర్
మార్చి 29	బెంగళూరు X కోల్‌కతా	బెంగళూరు
మార్చి 30	లక్నో X పంజాబ్	లక్నో
మార్చి 31	గుజరాత్ X హైదరాబాద్	అహ్మదాబాద్
మార్చి 31	ఢిల్లీ X చెన్నై	వైజాగ్
ఏప్రిల్ 1	ముంబై X రాజస్తాన్	ముంబై
ఏప్రిల్ 2	బెంగళూరు X లక్నో	బెంగళూరు
ఏప్రిల్ 3	ఢిల్లీ X కోల్‌కతా	వైజాగ్
ఏప్రిల్ 4	గుజరాత్ X పంజాబ్	అహ్మదాబాద్
ఏప్రిల్ 5	హైదరాబాద్ X చెన్నై	హైదరాబాద్
ఏప్రిల్ 6	రాజస్తాన్ X బెంగళూరు	జైపూర్
ఏప్రిల్ 7	ముంబై X ఢిల్లీ	ముంబై
ఏప్రిల్ 7	లక్నో X గుజరాత్	లక్నో

నోట్: తొలి మ్యాచ్ ఒక్కటే రాత్రి 8 గంటలకు ప్రారంభం కానుండగా... మిగతా రాత్రి మ్యాచ్‌లన్నీ గం.7:30 నుంచి... మధ్యాహ్నం మ్యాచ్‌లన్నీ గం. 3:30 నుంచి జరుగుతాయి.

సిరీస్ లక్ష్యంగా...

ఐదుటెస్టుల సిరీస్‌లో భారత్ మూడో టెస్టుతో పైచేయి సాధించింది. ఇప్పుడు రాంచీలో సిరీస్ విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. రోహిత్ శర్మ బృందానికి ఇప్పుడు యువ ఆటగాళ్లే బలంగా మారారు. యశస్వి జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్ అవకాశాల్ని బాగా అందిపుచ్చుకున్నారు. ఇపుడు ఇదే బలగంతో ఒక మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను ఇక్కడే ముగించాలని టీమిండియా ఆశిస్తోంది.

- సమరోత్సాహంతో టీమిండియా
- నేటి నుంచి ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టు
- ఒత్తిడిలో స్టోక్స్ బృందం
- ఉదయం గం. 9:30 నుంచి స్పోర్ట్స్‌-18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



స్టోక్స్



రోహిత్

రాంచీ: తొలి టెస్టులో ఇంగ్లండ్ చేతిలో అనూహ్యంగా ఓడిన భారత్ ఆ తర్వాత వరుసగా రెండు, మూడు టెస్టుల్లో గెలిచింది. రెండో టెస్టులో బుమ్రా పేస్, మూడో టెస్టులో జడేజా స్పిన్ కీలక భూమిక పోషిస్తే... ఈ రెండు టెస్టుల్లోనూ యువ సంచలనం యశస్వి డబుల్ సెంచరీలు కామన్‌గా కలిసొచ్చాయి. రోహిత్, గిల్‌లతో టాపార్డర్‌కు ఏ ఢోకా లేదు. మిడిలార్డరే అనుభవలేమితో ఉంది. రజత్ పటిదార్‌కు రెండు మ్యాచ్‌ల్లోనూ అవకాశమిచ్చినా ఏమాత్రం మెప్పించలేకపోయాడు. గత మ్యాచ్ ఆడిన సర్ఫరాజ్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ నిరూపించుకున్నాడు. జడేజా శతకం మిడిలార్డర్‌ను నిలబెట్టింది. బుమ్రా లేని పేస్ బౌలింగ్‌కు తొలిసారిగా సిరాజ్ పెద్దదిక్కయ్యాడు. ఇన్నాళ్లు షమీ, బుమ్రాలతో బంతిని పంచుకునే అతను రాంచీలో ప్రధాన పేసర్‌గా బరిలోకి దిగబోతున్నాడు. స్పిన్ వికెట్ కాబట్టి ముగ్గురు రెగ్యులర్ స్పిన్నర్లు బరిలోకి దిగడం ఖాయమనిపిస్తోంది. గురువారం నెట్స్‌లో ఆకాశ్‌దీప్ గంటల తరబడి శ్రమించాడు. ఒకవేళ సిరాజ్‌కు జోడీగా అతన్ని పరిశీలించవచ్చు.

సమం కోసం ఇంగ్లండ్ సమరం

ప్రస్తుత భారత్‌తో పోలిస్తే స్టోక్స్, రూట్, డకెట్, క్రాలీ, పోప్, అండర్సన్‌లతో కూడిన ఇంగ్లండే అనుభవజ్ఞులతో మేటిగా ఉంది. అయినాసరే సిరీస్‌లో భారత కుర్రాళ్ల జోరుకు కళ్లెం వేయలేక డీలా పడుతోంది. రాజ్‌కోట్‌లో అయితే మొదటి ఇన్నింగ్స్‌లో అదరగొట్టిన స్టోక్స్ సేన రెండో ఇన్నింగ్స్‌కు వచ్చేసరికి చేతులెత్తేసింది. రూట్, ఒలీ పోప్, బెయిర్‌స్టోల వైఫల్యం జట్టుకు ప్రతికూలంగా మారింది. చాన్నాళ్ల తర్వాత కెప్టెన్ స్టోక్స్ బౌలింగ్ వేసేందుకు నెట్స్‌లో ప్రాక్టీస్ చేశాడు. గతేడాది యాషెస్ సిరీస్ మధ్యలోనే మోకాలి గాయం వల్ల స్టోక్స్ పూర్తిగా బ్యాటింగ్‌కే పరిమితమయ్యాడు. గత జూన్ నుంచి బౌలింగ్‌కే దిగలేదు. ఇప్పుడు మాత్రం బంతిపట్టే యోచనలో పడ్డాడు. వరుస మ్యాచ్‌ల ఓటమిలతో ఇంగ్లండ్ తుది జట్టులో మార్పులు చేసింది. లెగ్ స్పిన్నర్ రేహన్ అహ్మద్ స్థానంలో ఆఫ్‌స్పిన్నర్ షోయబ్ బషీర్‌ను హార్ట్‌లీకి జోడీగా బరిలోకి దించుతోంది. మార్క్ వుడ్‌ను తప్పించి రాబిన్సన్‌ను తుది జట్టులోకి తీసుకున్నారు.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), జైస్వాల్, శుబ్‌మన్ గిల్, పటిదార్, సర్ఫరాజ్, ధ్రువ్ జురెల్, జడేజా, అశ్విన్, సిరాజ్, కుల్దీప్, ముకేశ్/ఆకాశ్‌దీప్.

ఇంగ్లండ్: స్టోక్స్ (కెప్టెన్), క్రాలీ, డకెట్, ఒలీ పోప్, జో రూట్, బెయిర్‌స్టో, ఫోక్స్, హార్ట్‌లీ, బషీర్, రాబిన్సన్, అండర్సన్.

మహిళల లీగ్‌కు వేళాయెె...



డబ్ల్యూపీఎల్ ట్రోఫీతో కెప్టెన్లు స్మృతి, బెత్ మూనీ, అలీసా హీలీ, మెగ్ లానింగ్, హర్మన్‌ప్రీత్

నేటి నుంచి డబ్ల్యూపీఎల్	బరిలో 5 జట్లు, 22 మ్యాచ్‌లు	తొలి మ్యాచ్‌లో ముంబైతో ఢిల్లీ 'ఢీ'	మార్చి 17న ఫైనల్ పోరు

రాత్రి గం. 7:30 నుంచి స్పోర్ట్స్‌-18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీ రెండో సీజన్‌కు రంగం సిద్ధమైంది. గత ఏడాది తొలి సీజన్‌లో అభిమానులను ఆకట్టుకొని పలువురు యువ క్రికెటర్లను వెలుగులోకి తెచ్చిన ఈ లీగ్ మరోసారి అదే స్థాయిలో ఆసక్తికరంగా సాగే అవకాశం ఉంది. నేడు చిన్నస్వామి స్టేడియంలో జరిగే తొలి మ్యాచ్‌లో గత సీజన్ విజేత ముంబై ఇండియన్స్‌తో రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్ తలపడుతుంది. మిగతా మూడు జట్లు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, యూపీ వారియర్స్, గుజరాత్ జెయింట్స్ కూడా ఈసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. గత ఏడాదిలాగే ఈసారి కూడా టోర్నీలో మొత్తం 22 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. మార్చి 17న ఢిల్లీ వేదికగా ఫైనల్ జరుగుతుంది.

తాజా సీజన్ విశేషాలు....

- గత సీజన్‌లో ఒక్క ముంబైలోనే అన్ని మ్యాచ్‌లు జరిగాయి. ఈసారి బెంగళూరు, ఢిల్లీలను వేదికలుగా ఎంపిక చేశారు.
- తొలి సీజన్‌లాగే పాయింట్ల పట్టికలో అగ్ర స్థానంలో నిలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన జట్లు 'ఎలిమినేటర్' మ్యాచ్‌లో తలపడతాయి.
- గత ఏడాది ఐదు టీమ్‌లకు కెప్టెన్లుగా వ్యవహరించిన వారే ఈసారి సారథులుగా ఉన్నారు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అయిన మెగ్ లానింగ్ (ఢిల్లీ), అలీసా హీలీ (యూపీ), బెత్ మూనీ (గుజరాత్) ఆస్ట్రేలియన్లే కాగా...హర్మన్‌ప్రీత్ (ముంబై), స్మృతి మంధాన (బెంగళూరు) భారత స్టార్లు. భారత్ మినహా ఆసీస్ నుంచే గరిష్టంగా 13 మంది ప్లేయర్లు బరిలోకి దిగుతున్నారు.
- 2023 సీజన్‌లో సత్తా చాటిన సైకా ఇషాక్, శ్రేయాంక పాటిల్ ఆ తర్వాత భారత జట్టుకు ఎంపికయ్యారు. గత ఏడాది వీరిని కనీస ధర రూ.10 లక్షలకు తీసుకోగా... రెండు సీజన్ల మధ్య భారత జట్టుకు ఆడటంతో బీసీసీఐ నిబంధనల ప్రకారం వీరిద్దరికి రూ. 30 లక్షల చొప్పున లభిస్తాయి.
- ఈ సీజన్ వేలంలో కాశ్వీ గౌతమ్‌ను రూ.2 కోట్లకు గుజరాత్ జెయింట్స్ టీమ్ ఎంచుకుంది. అయితే గాయం కారణంగా ఆమె ఈ సీజన్ నుంచి అనూహ్యంగా తప్పుకోవడం గమనార్హం.
- హైదరాబాద్, ఆంధ్ర జట్ల నుంచి 8 మంది ఈసారి డబ్ల్యూపీఎల్‌లో బరిలోకి దిగనున్నారు. హైదరాబాద్ ప్లేయర్లు అరుంధతి రెడ్డి (ఢిల్లీ), త్రిష పూజిత (గుజరాత్), యషశ్రీ, గౌహర్ సుల్తానా (యూపీ) జట్లకు... ఆంధ్ర క్రికెటర్లు స్నేహ దీప్తి (ఢిల్లీ), సబ్బినేని మేఘన (బెంగళూరు), షబ్నమ్ (గుజరాత్), అంజలి శర్వాణి (యూపీ) టీమ్‌ల తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు.